క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక క్రిస్టియన్‌పల్లిలోని వెంకట రమణకాలనీలో నిర్మిస్తున్న డ్రెయినేజీ, ఎదిర శివారులోని తిరుమల కాలనీలో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను ఆదివారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు సోకకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు హనుమంతు, శివశంకర్, మునీరుద్దీన్, చిన్నా, ఖాజాపాషా, కాలనీవాసులు వేణుగోపాల్, గుర్నాథ్‌రెడ్డి, మల్లేశ్, నాని పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత చిన్నరేవల్లి జట్టు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శనివారం రాత్రి వరకు నిర్వహించిన ఈశా గ్రామోత్సవం పురుషుల వాలీబాల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయి. చిన్నరేవల్లి జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో చిన్నరేవల్లి జట్టు 25–19, 25–14 సెట్ల తేడాతో మరికల్ జట్టుపై విజయం సాధించింది. మూడోస్థానంలో నవాబ్‌పేట, నాలుగో స్థానంలో పోలేపల్లి జట్లు నిలిచాయి. విన్నర్, రన్నర్ జట్లకు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నవీరయ్య, సీనియర్ పీడీ వేణుగోపాల్ ట్రోఫీలు, సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

చిన్నచింతకుంట: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్య మని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మదనాపురం మండలం కొత్తపల్లికి చెందిన పద్మమ్మ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ.. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతుంది. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2లక్షల ఎల్‌ఓసీని ఆదివారం దమగ్నాపురంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



జడ్చర్ల టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని సాలెహ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారుల మహాసభకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బిక్షపతి మాదిగ తెలిపారు. ఆదివారం మండలంలోని పోలేపల్లిలో దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివకుమార్, వీహెచ్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి నరేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు శ్రీరామ్, కమలాకర్, గద్దం యాదన్నలు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు ఆర్థిక సాయం



అడ్డాకుల: మండలంలోని సంకరామయ్యపల్లికి చెందిన లారీ డ్రైవర్ కోటేశ్ రెండువారాల కిందట హైదరాబాద్‌లో కరెంట్ షాక్‌కు గురై గాయపడ్డాడు. ఇంటి వద్ద ఉండి కోలుకుంటున్న మిత్రుడిని తోటి డ్రైవర్లు ఆదివారం పరామర్శించారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.18 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నాగేందర్‌యాదవ్, అహ్మద్, మనోహర్, బాలరాజు, కురుమూర్తి, రామాంజనేయులు, హుస్సేన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన వడ్డే చెన్నమ్మ(56) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. బాధిత కుటుంబానికి ఆదివారం తక్షణ సాయంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి రూ.5వేల ఆర్థిక సాయం చేశారు. నగదు అందించినవారిలో అంజయ్య, నిరంజన్, సలావుద్దిన్,రమేశ్, నసీర్ ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

ధన్వాడ: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 2000–2010 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వార్డెన్లు, ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం హాస్టల్ విద్యార్థులకు బోర్డులు, ప్రాజెక్టుకు పనికొచ్చే నోటుపుస్తకాలు, ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు. వార్డెన్ విజయకుమార్, సాయిరెడ్డి, యాదయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆలోచన అదిరింది..
అమలుకు దూరమైంది



గుడూర్ గ్రామంలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డు

- గ్రామాల్లో నిరుపయోగంగా డంపింగ్‌యార్డులు
- రూ.లక్షలు ప్రజాధనం వృథా
- కనిపించని తడి, పొడిచెత్త విధానం
- సేకరించిన చెత్తను తగలబెడుతున్న సిబ్బంది
- పట్టించుకోని అధికార యంత్రాంగం

చిన్నచింతకుంట: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నది ఉద్దేశం, గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీకి వంటి ఉన్నత లక్ష్యాలతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్‌యార్డులు అలంకారప్రాయంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో అవి ఉపయోగంలో లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు అవసరాలకు వాడుకుంటున్నారు. పశువుల పాకలుగా, అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. వీటినిర్వహణ చూడాల్సిన పంచాయతీ కార్యదర్శులు వాటివైపు తొంగిచూడకపోవడం గమనార్హం.

నీరుగారుతున్న ప్రభుత్వ ఆశయం

పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు చేర్చి తడి, పొడిచెత్తను వేరు చేయాల్సి ఉంది. కానీ సిబ్బంది అంతా ఒకేదగ్గర కలిపి తీసుకెళ్లి డంపింగ్‌యార్డు పరిసరాల్లోని గుంతలు, కొన్ని గ్రామాల్లో ఊకచెట్టు వాగులో, ఊరిచివరలో పారబోసి తగలబెడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతుంది. ఒక్కో డంపింగ్ యార్డుకు ప్రభుత్వం రూ.2.50లక్షల చొప్పున నిధులు ఖర్చు చేసింది. రూ.కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. డంపిగ్ యార్డులను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ లోపమే కారణమని గ్రామాల్లో ప్రజల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి.

కనిపించని తడి, పొడిచెత్త పద్ధతి

ఉమ్మడి చిన్నచింతకుంట మండలంలోని ఏ ఒక్క గ్రామంలో తడి, పొడిచెత్త వేరు చేసే పద్ధతి కొనసాగడంలేదు. గ్రామాల్లో చెత్తను సేకరించటప్పుడే ప్రజలు తడి, పొడిచెత్తను వేరుచేసి సిబ్బందికి అందించాల్సి ఉంది. కాని అవగాహన లోపంతో ప్రజలు అలా చేయకుండా చెత్తను కలిపి తీసుకొచ్చి సిబ్బందికి అందిస్తున్నారు. సిబ్బంది అలాగే ట్రాక్టర్లలో వేసుకొని డంపింగ్ యార్డుల వద్ద, గుట్టల ప్రాంతంలో పారబోసి తగలబెడుతున్నారు. దీంతో మండలంలోని చిన్నచింతకుంట, అల్లీపురం, అమ్మాపురం, గూడూర్, అప్పంపల్లితోపాటు పలు గ్రామాల్లో డంపిగ్‌యార్డులు నిరుపయోగంగా మారి వాటి చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు మొలిచాయి. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో పర్యవేక్షించి డంపిగ్‌యార్డులను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



ఊకచెట్టు వాగు పరిసరాల్లో పారబోసిన చెత్త

ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు



పంచాయతీ సిబ్బంది చెత్తను ఊరి పరిసరాలు, వాగులు, గుట్ట ప్రాంతాల్లో వేసి చేతులు దులుపుకొంటున్నారు. ఊకచెట్టు వాగులోనే వేస్తుండడంతో వాగు ఉధృతంగా వచ్చినప్పుడు నీటిలో కలిసి కలుషితమవుతుంది. అంతేకాక దుర్వాసన వచ్చి ప్రజలు రోగాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చెత్త డంపింగ్ గుంతలోనే వేసే విధంగా చర్యలు చేపట్టాలి.

– వెంకటేశ్, చిన్నచింతకుంట గ్రామస్తుడు

చెత్తను డంపిగ్ యార్డుల్లోనే వేస్తున్నారు



గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది చెత్తను సేకరించి డంపిగ్ యార్డులకు చేరుస్తున్నారు. కాని ఏ గ్రామంలోనైనా వేరేచోట పారబోసినట్లు మాదృష్టికి రాలేదు. పంచాయతీ కార్యదర్శులతో చర్చించి చర్యలు తీసుకుంటాం. అలాగే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి తడి, పొడిచెత్త వేరుచేసి ఇచ్చేలా అవగాహన కల్పిస్తాం. తడి, పొడిచెత్త పద్ధతిని కొనసాగిస్తాం.

– అనిల్‌కుమార్, ఎంపీఓ, చిన్నచింతకుంట

జడ్చర్లలో విజృంభిస్తున్న డెంగీ



సెల్లార్‌లో నిలిచిన ఉన్న వరదనీరు

- వెంకటేశ్వరకాలనీలో కాలనీలో అసంపూర్తి సెల్లార్‌లో నిలిచిననీరు
- దోమలు వృద్ధిచెంది రోగాలకు అనుకూలం
- వ్యాధులు విస్తరించే అవకాశం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో 4వ వార్డులోని వెంకటేశ్వరకాలనీలో డెంగీ, అంటువ్యాధుల భయం వెంటాడుతుంది. ప్రస్తుతం కాలనీలో ముగ్గురు డెంగీ లక్షణాలతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాలనీకి చెందిన మంచన హైమావతి అనే మహిళ కొత్తపేట ఓమిని ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఇదే కాలనీకి చెందిన మాజీ మార్కెట్ డైరెక్టర్ రామావతార్ జవహర్ అనేవ్యక్తి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే కాలనీలోనే అద్దెకు ఉంటున్న ఓ మహిళకు డెంగీ లక్షణాలు వెలుగు చూడగా స్వగ్రామానికి వెళ్లి చికిత్స పొందుతుంది. ఒకే కాలనీలోని సమీప ఇళ్లల్లో మూడు డెంగీ లక్షణాలున్న కేసులు నమోదుకావడంతో కాలనీవాసులు ఆందోళనలకు గురవుతున్నారు. డెంగీ లక్షణాలతోపాటు జ్వరాలబారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. ఇందుకు ప్రధాన కారణం కాలనీలోని ప్రధాన రోడ్డుపక్కనే ఉన్న సెల్లార్‌లో వరదనీరు నిలవటమే. దీంతోపాటు ఓపెన్‌ప్లాట్లు, టీటీడీ కల్యాణ మండప స్థలంలో వరదనీరు, మురికి నీరు నిల్వుండటం, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఆ ప్రాంతంలో క్రిమికీటకాల భయం సైతం వెంటాడుతుంది.ప్రధానంగా సెల్లార్ అనుమతి లేకున్నా చేయటం, ఖాళీగా వదిలేయడంతో చెత్తాచెదారం పేరుకుపోతుంది. సెల్లార్‌లో నీరు నిలిచి దుర్వాసన వస్తుంది. దోమలు పెరిగి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి.

మూడురోజులుగా జ్వరం



మూడు రోజులుగా జ్వరంతో బాధపడ్డా. ఇప్పుడిప్పుడే కోలుకుని బయటకు వచ్చా. కాలనీలో డెంగీ వ్యాధులు ప్రబలుతున్నాయి. మా వదినతోపాటు, మాజీ డైరెక్టర్, మా ఇంట్లో అద్దెకు ఉంటున్న మహిళ డెంగీ లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారు. మా ఇంటి పక్కనే సెల్లార్‌లో వరదనీరు నిల్చుని దోమలు పెరిగి వ్యాధుల భయం వెంటాడుతుంది. మా వదినతోపాటు కాలనీలో మొత్తం మూడు డెంగీ కేసులు వచ్చాయి. సెల్లార్‌లో నీరు, వరదనీరు తొలగించాలి.

– మంచన ప్రభాకర్, వెంకటేశ్వరకాలనీ

వ్యాధులు పెరుగుతున్నాయి



సెల్లార్‌లో వరదనీరు నిల్చుండడం, ప్రాంతమంతా పిచ్చిమొక్కలు పెరిగి దోమలు వృద్ధి చెంది వ్యాధులు పెరుగుతున్నాయి. మా కాలనీ మహిళ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో డెంగీ లక్షణాలతో చికిత్స తీసుకుంటుంది. ఇంటింటికి జ్వరాల భయం వెంటాడుతుంది. సెల్లార్ నీటిలో పాములు తిరుగుతున్నాయి. వాటివల్ల భయం వెంటాడుతుంది. అట్లాగే ఇంటిపక్కన అంతా చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పెరిగి వ్యాధులు పెరిగేందుకు కారణమవుతుంది. సెల్లార్‌ను తొలగించి, ఖాళీప్లాట్లలో పిచ్చిమొక్కలు చదును చేయించాలి.

– జగదీశ్, వెంకటేశ్వరకాలనీ

సెల్లార్‌ను మూసివేయాలని కమిషనర్‌ను కోరా

4వ వార్డు వెంకటేశ్వర కాలనీలో ఉన్న సెల్లార్‌ను మూసివేయాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లా. ఇప్పుడైతే ముగ్గురు డెంగీ లక్షణాలతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఇంకా కొందరు జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. సెల్లార్‌లో వరదనీటిని తొలగించి పిచ్చిమొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– దేవా, 4వ వార్డు కౌన్సిలర్

కరాటేలో విద్యార్థులకు పతకాలు



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో ఆదివారం జరిగిన నేషనల్ లెవెల్ కరాటే పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన కింగ్‌షోటోకాన్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో హుమేర, ఖిజ్ర, హఫ్సా, ఆయేషా, గుల్‌ఫిషా, తనీశ్, అమాన్, సూఫియాన్, సాబేర్‌పాషా, బిలాల్, జుల్ఫీకర్, ఫైజాన్, హుజేఫ్ బంగారు పతకాలు, నిఖిల్, నబీల్ రజత పతకాలు, ఖాసీం, అహ్మద్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు నిహాన్ షోటోకాన్ చీఫ్ రవీందర్‌కుమార్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు.

పదోన్నతులతో ఆత్మవిశ్వాసం

స్టేషన్ మహబూబ్‌నగర్: పదోన్నతులతో ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతందని ఆల్‌మేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ పేర్కొన్నారు. ఇటీవల గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన మహ్మద్ అతహర్ అహ్మద్, సమీ మహ్మద్‌తోపాటు మరికల్ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన మిర్జా కలీముల్లాను జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడంతో ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు ఎక్కువగా ఏర్పడుతాయని, ఈ విద్యాసంవత్సరం వరకైనా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని విద్యావలంటీర్ల నియామకం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ వహీద్‌షా, కోశాధికారి ఎంఏ రషీద్, కార్యదర్శి షేక్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి ప్రముఖుల నివాళి



చిన్నచింతకుంట: దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి మొదటి వర్ధంతిని దమగ్నాపూర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కు ల సంరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మహబుబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ జానకి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మైసమ్మ చెంత.. జనజాతర

నవాబుపేట: మైసమ్మ చెంత జనజాతర కొనసాగింది. ఆదివారం అమ్మవారి చెంత పెద్ద ఎత్తున పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని కాకర్లపహడ్ పంచాయతీ పరిధిలోని పర్వాతాపూర్ మైసమ్మ ఆలయానికి ఆదివారం వేలాది జనం తరలివచ్చారు. శ్రావణమాసం పూర్తి కావడంతో భక్తులు అమ్మవారికి ఇష్టమైన బోనం మొక్కులు చెల్లించేందుకు జనం తరలివచ్చారు. దీంతో అడవి మొత్తంఅమ్మవారి నామస్మరణతో మారుమోగింది.

‘నిజం నిలకడగానే తెలుస్తుంది’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: నిజం ఎప్పుడూ నిలకడగానే తెలుస్తుందని.. బీఆర్‌ఎస్ నాయకుల వ్యవహారశైలి.. నిజం తెలిసేలోపే అబద్ధం ప్రపంచాన్ని చుట్టి వస్తుందన్నచందంగా ఉందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆదివారం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన వ్యక్తి, ఒక ఆటో డ్రైవర్‌కు ఫిట్స్ వస్తే ఆ వ్యక్తిని ఎరువుల కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకొచ్చి, యూరియా కోసం వచ్చిన రైతు స్పృహ తప్పి పడిపోయాడని అందరినీ నమ్మించే ప్రయత్నం చేశాడని మండిపడ్డాడు. ప్రజా ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని కోరుకుంటుందన్నారు. ఇచ్చినమాట ప్రకారం హామీలను అమలు చేస్తుంటే జీర్ణించుకోక మహిళలు ఆర్టీసీ బస్సులో అల్లంవెల్లుల్లి పొట్టు తీస్తున్నారని, డ్యాన్సులు చేస్తున్నారని అవహేళన చేస్తూ కేటీఆర్ మహిళలను అవమానపరిచారని ఆరోపించారు. కొత్తగా రేషన్ కార్డుల్లో 9600మందిని చేర్చడం జరిగిందని, వారందరికీ సన్నబియ్యం పంపిణీ చేయబోతున్నామని వివరించారు.

గౌండ్యాల్‌లో 132కేవీ సబ్‌స్టేషన్

మండలంలోని గౌండ్యాల్‌లో 132కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి మండలంలో రైతులకు లోఓల్టేజీ సమస్య శాశ్వతంగా లేకుండా చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. అనంతరం 9,511మంది లబ్ధిదారుకుల రేషన్‌కార్డులు, 41మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇంటిని ప్రారంభించారు. బాలాజీకొండపై రూ.20లక్షలతో నిర్మించే షెడ్డుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బెక్కరి అనిత, పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మహేందర్, తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంపీడీఓ యశోద తదితరులు పాల్గొన్నారు.

ధర్మరక్షణలో వందేళ్ల ప్రస్థానం



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర బాధ్యుడు

నవాబుపేట: ధర్మరక్షణలో వందేళ్ల ప్రస్థానంలో సంఘం కార్యకర్తల ఎనలేని కృషి ఉందని ఆర్‌ఎస్‌ఎస్ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి నర్సింగప్ప సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ప్రయాణానికి సంబంధించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 1925లో ఏర్పాటైన ఆర్‌ఎస్‌ఎస్ నాటినుంచి అకుంటిత దీక్షతో ముందుకు సాగుతుందని వివరించారు. దేశరక్షణ, ధర్మరక్షణ పేరుతో ఎంతోమంది మహానుభావులను దేశానికి అందించిన గొప్ప మాతృసంస్థగా నిలిచిందని వివరించారు. అందుకే ప్రతి స్వయం సేవకుడు నిత్యశాఖతో ముందుకుసాగుతూ విశ్రాంతి లేకుండా ధర్మరక్షణలో సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహకార్యవాహ మల్లప్ప, ఖండా కార్యవాహ చంద్రమోహన్, ఏకల్ సంస్థ జిల్లా, బాధ్యులు చంద్రశేఖర్, రామకృష్ణ, రాఘవేంద్ర, శివాజీ, పాండురంగయ్య, నర్సింహులు ఉన్నారు.

మైసమ్మ తల్లీ.. అందించు దీవెనలు



రంగారెడ్డిగూడలో బోనాలతో వెళ్తున్న మహిళలు

జడ్చర్ల టౌన్/రాజాపూర్: 44వ నెంబరు జాతీయ రహదారిపై ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కావేరమ్మపేట నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. బోనాల ఉత్సవంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వార్డుకౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

- రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ లో ఆదివారం కోటమైసమ్మ బోనాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పురవీధులను వేపకొమ్మలతో తోరణాలతో అలంకరించారు. మహిళలు సుందరంగా తయారు చేసిన బోనాలను పురవీధు ల్లో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డి, రాములుగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, శివప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.



కావేరమ్మపేటలో బోనాలతో మహిళలు

ప్రపంచదేశాలు భారత్‌వైపు చూస్తున్నాయి

రాజాపూర్: ప్రపంచదేశాలు నేడు భారత్‌వైపే చూ స్తున్నాయని, మచ్చలేని మహానేత ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశ ప్రజలు గర్విస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముచ్చటగా మూడోసారి ప్రధాని అయిన నరేంద్రమోదీ దేశాభివృద్ధితోపాటు శత్రుదేశాల వెన్నుపుట్టేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా దేశ అభివృద్ధితోపాటు దేశప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు కేంద్రం అమలు చేసిందని, వాటిని ప్రతి గడపకు తీసుకెళ్లే బాధ్యత మనపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కార్యదర్శి అశోక్‌గుప్తా, మండలాధ్యక్షుడు ఆనంద్, నాయకులు రాజేశ్, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి రంగ కార్మికుల సమస్యలపై దృష్టిపెట్టాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: స్కీం వర్కర్లు, అసంఘటిత కార్మికులు, సాంప్రదాయ కార్మికులే కాకుండా ఉత్పత్తి రంగాలైన కీలకమైన పరిశ్రమలు, విద్యుత్, ట్రాన్స్‌పోర్ట్, రైల్వే తదితర అత్యంత కీలకమైన రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి సూచించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. పోలేపల్లి సెజ్, బాలానగర్ నుంచి అడ్డాకుల వరకు ఉన్న పరిశ్రమల్లోని ఫార్మా ఉత్పత్తి రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను సంఘటిత పరిచేందుకు కృషి చేయాలన్నారు. పారిశ్రామిక కార్మికవర్గాన్ని ఐక్యం చేస్తూ జిల్లా ఉద్యమాలను విస్తృత పర్చాలన్నారు. సీఐటీయూ సీనియర్ నాయకుడు కిల్లెగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి మాట్లాడుతూ.. పరిశ్రమల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ, బోనస్, గ్రాట్యూటీ వంటి సౌకర్యాలు కల్పించకుండా యాజమాన్యాలు శ్రమ దోపిడీ చేస్తున్నాయన్నారు. దీనిపై నిర్దిష్టంగా సర్వేలు చేసి అధికారులకు వినతులు ఇవ్వాలని, పారిశ్రామిక కార్మికులపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు రాములు, ఖమర్‌అలీ, తిరుమలయ్య, వేణుగోపాల్, రాజ్‌కుమార్, చంద్రకాంత్, ఆంజనేయులు, నారాయణ, కురుమూర్తి పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల కమిటీ ఎన్నిక

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలం ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ కార్యవర్గాన్ని మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు నర్సింహ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నజీర్, కమిటీ వ్యవస్థాపకుడిగా యాకోబ్, మండలాధ్యక్షుడిగాపీటర్, ఉపాధ్యక్షులుగా రాఘవేందర్, విక్రమ్, ప్రధాన కార్యదర్శిగా సాగర్, కోశాధికారిగా శరత్‌కుమార్, కార్యదర్శిగా బాలు, ప్రచార కార్యదర్శిగా జాన్, కుటుంబ భరోసా ఇన్‌చార్జ్‌గా ఖాదర్‌ను ఎన్నుకున్నారు.అనంతరం కమిటీ సభ్యులను జిల్లా అధ్యక్షుడు శాలువాలతో సన్మానించి అభినందించారు.

శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రూరల్ మండలంలోని తెలుగుగూడెం, కోడూరుతండాలో ఆదివారం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి ఊరేగించారు. కృష్ణం వందే జగద్గురుమ్.. అంటూ భక్తులు భక్తిపారవశ్యంలో మునిగితేలారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో సంఘం నాయకులు నాగ్యానాయక్, శ్రీనివాసులు, విజయభాస్కర్‌రెడ్డి, రవి, తిరుపతయ్య, వెంకటేశ్, సత్యం, వెంకట్రాములు, భాస్కర్, మల్లేశ్ పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక మహబూబ్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడి ప్రతి మ ఊరేగింపు ఆదివారం జడ్చర్లలో దిగ్విజ యంగా ముగిసింది. వెంకటేశ్వరకాలనీలో ప్రా రంభమైన ఊరేగింపు సరస్వతీ కాలనీలో ముగిసింది.

రమణీయం.. రంగనాయక స్వామి రథోత్సవం



దేవరకద్ర: మండలంలో వెంకటాయపల్లి ఊరగుట్టపై వెలసిన రంగనాయకస్వామి రథోత్సవం ఆదివారం తెల్లవారు జామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం నెలరోజులుగా స్వామి ఆలయంలో అఖండ దీపారాధనతో భజనలు నిర్వహించగా.. గ్రామమంతా మద్యం, మాంసానికి దూరంగా ఉంటూ భక్తిశ్రద్ధలతో నిత్యపూజలు నిర్వహిస్తూ వచ్చారు. శ్రావణమాసం ముగిసిన సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సం నిర్వహించారు. రథాన్ని రంగు రంగుల పూలు, మంగళతోరణాలతో అలంకరించి ప్రత్యేకంగా విద్యుద్దీపాల తోరణాలతో అలంకరించారు. ఊరగుట్టపై నుంచి స్వామి ఉత్సవమూర్తిని పల్లకీలో తీసుకొచ్చి రథంపై ఉంచి ముందుకులాగారు. రథోత్సవం సందర్భంగా స్వామి రథాన్ని గ్రామంలోని రచ్చకట్ట వద్దకు లాగి అక్కడున్న వేపచెట్టుకు రథాన్ని తాకించారు. దీనివల్ల వేపాకు తీయగా మారుతుందని గ్రామస్తుల నమ్మకం. రథోత్సవం అనంతరం స్వామివారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.